# గాలి తీసిన తిత్తి

ఆరున్నరకు కూర్చుంటే సుమారు ఎనిమిదింటి దాకా సాగుతుంది పూజ స్తోత్రపఠనం కొంతసేపు. కొంత సేపు ధ్యానం. ఆ తర్వాత రామకోటి రాయడం. ఇక అప్పట్నుంచీ లౌకిక వ్యవహారాలు. తొమ్మిదిన్నరకు ఆఫీసుకు బయలు దేరడం. ఆఫీసులో పదింటినుంచీ ఐదింటిదాకా కాలక్షేపం. ఆరో ఆరున్నరకో ఇల్లు చేరుకో వడం. తర్వాత ఇల్లాలితో ముచ్చట్లు. ఆ తర్వాత పిల్లలకి చదువు చెప్పడం. కొంతసేపు టీ.వి.కార్యక్రమాలు చూడడం. ఇల్లాలితో లోకాభిరామాయణం వగైరాలు. చివరికి నిద్ర. ఇదీ సదాశివం దైనందిన కార్యక్రమం. ఎన్ని పనులున్నా సరే పూజ మాత్రం నిర్విఘ్నంగా సాగుతున్నందుకు మహా సంతోషించేవాడు. అదంతా తన సంకల్పశక్తి అనుకునేవాడు. ఆ అనుకోవడం ఒక్కొక్కసారి అహంభావానికి దారి తీసేది. సహోద్యోగులలో కొంతమంది ఆఫీసుకి బయలుదేరేంత వరకు ఇంటి పనులతో సతమతం కావడం చూసి తన కార్యదీక్షను సంకల్పబలాన్ని మరోసారి గుర్తు చేసుకునేవాడు సగర్వంగా.

ఒక రోజు మామూలు వేళకు సదాశివం ఆఫీసునుంచి వచ్చాడు. భార్యను చూసి నిర్ఘాంతపోయాడు. ఆమె తన బట్టలు సర్దుకుంటోంది పెట్టెలో. భర్తరాకను కూడా గమనించలేదు.

'శాంతా, ఏమిటి?' అడిగాడు సందేహంగా. అతని దృష్టి పెట్టెమీద వుంది.

కళ్ల నీళ్లు గుక్కుకుంటూ వచ్చిన టెలిగ్రాం చూపించింది. అతను చూశాడు. ముఖం మారిపోయింది.

'ఇప్పుడు రైలు టైం అయిపోయింది. బస్సుకే వెళ్లడం మంచిది... అత్తగారు నాకు చేసిన మేలుని నేను మరిచిపోలేను..' అన్నాడు అత్తమామల ఫోటోని చూస్తూ.

'నాకూ రావాలనే వుంది. పిల్లల కేమో రేపటినుంచీ పరీక్షలు. అవికాగానే పిల్లల్ని తీసుకుని నేను వస్తాను...నువ్వు త్వరగా బయల్దేరు, బస్సు టైమవుతోంది.'

శాంత బయలుదేరింది. వీధి గుమ్మం దాకా వెళ్లి, దేవుడి గదిలోకి వచ్చి అక్కడున్న పటాలకు నమస్కరించి, 'పరీక్షలు బాగారాయండి' అని పిల్లలకి చెప్పి వీధిలోకి వచ్చింది. అప్పుడే భర్త పిలుచుకువచ్చిన ఆటో యింటిముందు ఆగింది.

భార్యను బస్సెక్కించి వచ్చిన సదాశివం సరాసరి తన గదిలోకి వెళ్లాడు. పిల్లలిద్దరూ చదువుకుంటున్నారు. 'అన్నం వండాను కూర కూడ అక్కడే వుంది' చదువుకుంటూనే కూతురు చెప్పింది.

శాంత పుట్టిల్లు చేరే దాక అత్తగారు బతికుంటే బాగుండును. ఆఖరి చూపైనా దక్కుతుంది అనుకున్నాడు. సదాశివం. టెలిగ్రాం మళ్లీ చదువుకున్నాడు. సీరియస్...వెంటనే బయల్దేరు...అని వుంది. మనస్సు పరిపరివిధాల పోయింది. మాతృ విహీనుడైన తనను అత్తగారు ఆదరభావంతో చూసింది. ఎన్నడూ చులకనచేసి మాట్లాడలేదు. ఆవిడ చూపిన ఆప్యాయతను గుర్తు చేసుకున్నాడు. ఆ రాత్రి అన్నం ముందు కూర్చున్నాడే కాని ముద్ద మింగుడు పడలేదు. పాత విషయాలు మనస్సుని ఆక్రమించాయి.

రాత్రి ఎలాగో గడిచింది. తెల్లవారింది. తెల్లవారుజామునే లేచిన కూతురు అన్నం, కూర అన్నీ సిద్ధం చేసి తండ్రికి విడిగా వుంచింది. తానూ తమ్ముడూ భోజనం చేసి పరీక్షలకు సిద్ధమవుతున్నారు.

సదాశివం పూజకు కూర్చున్నాడు. పూలసజ్జలో పువ్వులు లేవు. లేచివెళ్లి పువ్వులు కోసుకువచ్చి మళ్లీ పూజకు కూర్చున్నాడు. రెండు నిమిషాలకు కాలింగ్ బెల్ మోగింది. మళ్లీ విఘ్నం, వెళ్లి చూశాడు. 'ఏం బాబూ, కూరలేమన్నా కావాలేమో కనుక్కోండి' కూరలమ్మాయి అడిగింది, 'నేనిప్పుడు పూజలో వున్నాను. రేపురా' అంటూ వెనుదిరిగాడు. 'అమ్మగారులేరా?' విడిచిపెట్టలేదు కూరలమ్మాయి. విసుక్కుంటూనే వాళ్ల

అమ్మగారికి సీరియస్‌గా వుందని టెలిగ్రాం వస్తే వూరికి వెళ్లింది, నిన్నరాత్రి' అని సదాశివం సమాధానం చెప్పాడు. 'పాపం, పెద్దమ్మగారు నోట్లో నాలుకలేని వారండి. ఎలా వున్నారో యేమిటో...' అని సానుభూతి ప్రకటించింది. అవునవును–అంటూ వీధి తలుపు వెయ్యబోయాడు సదాశివం. 'ఇప్పుడెలా వుందో. మళ్లీ టెలిగ్రాం వచ్చిందా బాబుగారూ...?' 'నేనూ అందుకోసమే ఎదురు చూస్తున్నా. మనస్సు మనస్సులో లేదు' అని వీధి తలుపువేసి మందిరం వద్దకు వెళ్లాడు.

ప్రతినిత్యం పారాయణం చేసే, సుందరకాండ చదవడం మొదలుపెట్టాడు. మళ్లీ టెలిగ్రాం వచ్చిందా అంటూ కూరలవ్వాయి అడిగిన ప్రశ్న మనస్సులో మెదిలింది. అవును...జరక్కూడనిది జరిగి వుంటే టెలిగ్రాం వచ్చేదే, రానందుకు సంతోషించాడు. అయినా మనస్సు సుందరకాండ మీదలేదు. చదువుతున్న పుస్తకం మూసివేశాడు. కాసేపు ధ్యానమైనా చేద్దామనుకున్నాడు. కళ్లు మూసుకున్నాడు.

'సార్...సార్...' వీధిలోంచి పిలుపు విన వచ్చింది.

'వచ్చె...వచ్చె'

'టెలిగ్రాం...'

సదాశివానికి శ్వాస ఆగిపోయినట్టయింది. అవాంగళవేందో సంభవించినట్టు భావించాడు. ఆదుర్దాగా వీధి తలుపు తెరిచాడు. టెలిగ్రాం అందుకుని చదివాడు. గండం గడిచింది. చదువుకుని 'అమ్మయ్యా' అనుకున్నాడు.

'సంతకం సార్,'

'మరోలా అనుకోవద్దుబాబూ' అంటూ సంతకం పెట్టి యిచ్చాడు కాగితం.

మనస్సు కుదుటబడింది. మళ్లీ అంతరాయం కలగకముందే పూజ ముగించడం మంచిదనుకున్నాడు. పారాయణం ప్రారంభించాడు. ఆఫీసుకి టైమవుతోందన్న ఆందోళన ఒక వైపు; పారాయణం సవ్యంగా సాగడంలేదన్న చింత ఒక వైపు. అందువల్ల త్వరత్వరగా చదవసాగాడు. ఆ తొందరలో

తడబడిపోయాడు. తప్పులు దొర్లిపోతున్నాయి. చదవడం ఆపివేశాడు. ఇంతలో గోడ గడియారం తొమ్మిది కొట్టిన సవ్వడి చెవులలో పడింది. అంతే. సదాశివం గుండెలో రైళ్లు పరిగెత్తసాగాయి. రామకోటిరాయాలి. భోజనం చెయ్యాలి. తలుపులన్నీ–ముఖ్యంగా దొడ్డితలుపు– వెయ్యాలి. కొన్నిటికి తాళాలు పెట్టాలి. భోజనం చెయ్యాలని కూర్చున్నాడు. ఒక ముద్ద నోట్లో పెట్టుకున్నాడు. అప్పుడు గుర్తుకి వచ్చింది, దేవుడికి నైవేద్యం పెట్టని విషయం. హారతి చూపినప్పుడైనా అది గుర్తుకి రానందుకు తన్ను తాను నిందించుకున్నాడు. చెయ్యి కడుక్కుని పటిక బెల్లం ముక్కల డబ్బా చూశాడు. అది అయ్యవారి నట్టిల్లుగా వుండడంతో విసుక్కున్నాడు. పంచదార నైవేద్యం పెట్టాడు. వెంటనే మహాపచారం చేసినట్లుగా భావించాడు. తాను ఒక ముద్ద తిన్న తర్వాత దేవుడికి నైవేద్యం పెట్టడమా! అది అపచారం కాక మరేమవుతుంది? అది భావం కలిగిన మరుక్షణమే కంచంలో పెట్టుకున్న అన్నాన్ని గిన్నెలో కుమ్మరించి, కూరను కూరగిన్నెలో వుంచి, కంచం కడిగి బోర్లించాడు. మాటి మాటికి భార్య గుర్తుకి వచ్చింది. ఆవిడ ఒక్కరోజు యింట్లో లేకపోయేసరికి, దేవుడు కూడా పస్తుండవలసి వచ్చింది. తాను స్నానం చేసి మందిరం వద్దకు వచ్చేసరికి పూలసజ్జలో పువ్వులుండేవి. హారతి పళ్లెంలో కర్పూరం వుండేది. పటిక బెల్లం ముక్కలు విడిగా ఒక చిన్న పళ్లెంలో వుండేవి. మందిరం ముందు బియ్యప్పిండితో వేసిన ముగ్గు కనులవిందు చేసేది. ఒక్కరోజులో ఎంత మార్పు!

తు.చ. తప్పకుండా భార్య అన్నీ అమర్చడం వల్లనే తాను పూజాదికం సక్రమంగా చేయగలిగానని అప్పుడనుకున్నాడు సదాశివం, ఇన్నాళ్లుగా మెచ్చుకున్న తన సంకల్పబలాన్ని తానే సంశయించాడు. ఇంటిపనులతో సతమతమైపోతున్న సహోద్యోగుల్ని పరిహసించడం అవివేక మనుకున్నాడు. మళ్లీ భార్య గుర్తుకి వచ్చింది సదాశివానికి.

నేను నిష్ఠా గరిష్టుణ్ణి అనీ తన భార్యకు వంటిల్లే స్వర్గమనీ అతని అభిప్రాయం. ఇప్పుడది తలక్రిందులయింది, వంటింటి పనులేకాక తన

విధుల్ని కూడా ఆమె సక్రమంగా నిర్వర్తించడం వల్లనే తన నిష్టకు భంగం వాటిల్లలేదనే అసలు విషయం గ్రహించాడు. దాంతో అతని అహం పటాపంచలయింది. భార్యపట్ల గౌరవాభిమానాలు కలిగాయి. ఆవిడ వల్ల కుటుంబసభ్యులందరికీ మేలు కలుగుతోంది. మరి తన నిష్ఠ వల్ల? తనకు తప్ప మరెవరికీ లాభం కలగడంలేదని అనుకున్నాడు.

ఆఫీసుకి బయలుదేరాడు సదాశివం, చేరుకునేసరికి పది దాటింది,ఎన్నడూ ఆలస్యంగా రాని సదాశివం ఆలస్యంగా రావడం అందరినీ ఆశ్చర్యపరిచింది. పక్కసీటులోని సహోద్యోగి మందహాసం చేస్తూ అడిగాడు!

'ఏవిటి యివ్వాళ్ల విశేషం?'

'నిన్నటి దాకా నా అహంకారం గాలి నింపిన తిత్తి. ఇవ్వాళ్ల గాలి తీసిన తిత్తి' అన్నాడు సదాశివం నవ్వుతూనే. అర్థంకాక ఆ సహోద్యోగి అతని వంక చూశాడు!